# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 28 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల..

- 73.35 శాతం విద్యార్థులు పాస్
- జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగిన పరీక్షలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఈసారి 73.35 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జూన్ 3 నుండి 13వ తేదీ వరకు ఈ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 42,832 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా..38,741 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. అందులో 24,415 మంది విద్యార్థులు ఉత్తీర్ణులుగా నిలిచారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ https://bse.telangana.gov.in/ASERESJUN25/లో చూసుకోవచ్చునని విద్యాశాఖ సూచించింది. రోల్ నంబర్‌ను నమోదు చేసి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధిత పాఠశాలలను లేదా జిల్లా విద్యాధికారుల కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

# గిగ్ వర్కర్లకు ప్రత్యేక పాలసీ

- దేశానికే రోల్ మోడల్ పాలసీ తీసుకొస్తాం
- అసెంబ్లీలో చట్టం రూపంలో ప్రవేశపెట్టేలా చర్యలు చేపడతాం
- రాజస్థాన్ తరహాలో కార్మికుల కోసం ప్రత్యేక చట్టం
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి
- గిగ్ వర్కర్ల సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో గిగ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల కోసం దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ప్రత్యేక పాలసీ రూపొందించబో తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో గిగ్ వర్కర్ల సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "గిగ్ వర్కర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారికీ హక్కులు కల్పించాల్సిన అవసరం ఉంది. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ తరహా కార్మికుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురాగా, తెలంగాణలో కూడా అలాంటి చట్టం తీసుకొచ్చే దిశగా ముందడుగులు వేస్తున్నాం," అని పేర్కొన్నారు.గిగ్ వర్కర్లకు రిజిస్ట్రేషన్ సిస్టమ్ అమలులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నామని, వారి నుంచి 66 సలహాలు, సూచనలు వచ్చాయని, వాటిపై అధికారులతో చర్చించామని తెలిపారు. త్వరలోనే తగిన సహాయం మరియు పాలసీ రూపకల్పనపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గిగ్ వర్కర్ల సమస్యలను కేబినెట్‌లో చర్చించి, అనంతరం అసెంబ్లీలో చట్టం రూపంలో ప్రవేశపెట్టేలా చర్యలు చేపడతామన్నారు. గిగ్ వర్కర్లకు కనీస వేతనం వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**4.5 లక్షల గిగ్ వర్కర్లకు మేలు కలుగుతుందని నమ్మకం**

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 4.5 లక్షలమంది గిగ్ వర్కర్లు ఉన్నారని, కొత్త చట్టం వల్ల వారందరికీ మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గిగ్ వర్కర్ల సమస్యలపై లిలిరాహుల్ గాంధీ 'భారత్ సమ్మిట్'లిలిలో కూడా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా గిగ్ ప్లాట్‌ఫామ్ అధ్యక్షులు అబ్దుల్ రౌఫ్, తెలంగాణ అధ్యక్షులు షేక్ సల్లాఉద్దీన్, ఐ–ఫెట్ ఉపాధ్యక్షులు నగేష్ కుమార్, యూనియన్ సభ్యులు అబ్దుల్ నాయూమ్, సయ్యద్ సాదిక్, మొహిసిన్, హంజద్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం

- అహ్మదాబాద్ వేదికగా ప్రపంచస్థాయి క్రీడా ఉత్సవం
- ప్రతి భారత పౌరుడికీ గర్వకారణం
- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో


2029లో జరగనున్న వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యంగా వ్యవహరించనుంది. ఈ సందర్భంగా కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఎక్స్‌లో శుక్రవారం ఆనందం వ్యక్తం చేశారు. భారత్‌కు ఈ గౌరవం దక్కటం ప్రతి భారత పౌరునికి గర్వకారణమని పేర్కొన్నారు.

**అహ్మదాబాద్‌కు గేమ్స్ నిర్వహణ బాధ్యత**

ఈ క్రీడలకు అహ్మదాబాద్ వేదికగా ఎంపికవడం గర్వకారణమని, ఇది ఆ నగరం క్రీడా పటిష్టతకు నిదర్శనమని షా పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోలీస్, ఫైర్, డిజాస్టర్ సర్వీసుల ఉద్యోగులు పాల్గొనే ఈ గేమ్స్‌లో 50కి పైగా క్రీడాంశాలు ఉంటాయి. "2029 వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం కలిగిన వేళ ప్రతి పౌరుడికీ గర్వకారణం. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి చేసిన విస్తృత క్రీడా మౌలిక సదుపాయాలకు ఇది ప్రపంచ స్థాయిలో గుర్తింపు," అని షా పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక గేమ్స్ నిర్వహణకు భారత్ ఎంపిక కావడం ద్వారా దేశంలో పెరుగుతున్న క్రీడా మౌలిక వసతుల సామర్థ్యం ప్రపంచానికి తెలియజేయడమే కాదు, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ ఈవెంట్లకు దారితీసే అవకాశాలు పెరుగుతాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మున్సిపల్ ఎన్నికలు ఎందుకు నిర్వహించట్లేదు..?

- తెలంగాణ హైకోర్టు
- ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో సకాలంలో పురపాలక ఎన్నికలు నిర్వహించకపోవడంపై హైకోర్టు సీరియస్ అయ్యింది. నిర్మల్ పురపాలక సంఘం పాలకవర్గానికి గడువు ముగిసినా ఇప్పటికీ ఎన్నికలు జరగకపోవడాన్ని తప్పుబడుతూ ఎస్. రాజేందర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి విచారించారు. పిటిషనర్ తరపు న్యాయవాది నరేష్ రెడ్డి వాదిస్తూ, "నిర్మల్ పురపాలక పాలకవర్గానికి గడువు మార్చి 25న ముగిసింది. ఎన్నికలు జరపకపోవడం రాజ్యాంగ ఉల్లంఘనకు సమానం. పాలకవర్గం గడువు ముగిసే ఆరు నెలల ముందు నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను పాటించలేదు" అని కోర్టులో తెలిపారు.

ఈ నేపథ్యంలో హైకోర్టు ప్రభుత్వం మరియు రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేస్తూ, "ఎన్నికలు ఎందుకు జరపలేకపోయారో పూర్తి కారణం కోర్టుకు తెలియజేయండి" అని ఆదేశించింది. తదుపరి విచారణను జులై 11వ తేదీకి వాయిదా వేసింది. ఇక ఇప్పటికే హైకోర్టు గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 నెలల లోపు నిర్వహించాలి అని స్పష్టం చేసింది. 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తిచేసి త్వరితగతిన ఎన్నికలు జరపాలని ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు సూచించింది.

## పూరి జగన్నాథ రథయాత్రలో అపశృతి..

- 500 మందికి పైగా గాయాలు



బలగం టీవీ, పూరీ

ఒడిశాలోని పూరిలో జరిగిన వార్షిక రథయాత్ర ఉత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. ఈ రథయాత్ర ఉత్సవం సందర్భంగా 500 మందికి పైగా భక్తులు గాయపడగా, పలువురి పరిస్థితి విషమంగా ఉంది. నగరంలో జగన్నాథ రథాన్ని లాగడానికి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఈ సంఘటన జరిగినట్లు సమాచారం. ఈ రథయాత్ర సందర్భంగా కొంతమంది స్పృహ కోల్పోయినట్లు వచ్చిన వార్తలపై ఒడిశా మంత్రి ముఖేష్ మహాలింగ్ స్పందించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. "అధిక తేమ కారణంగా, ఒకరు లేదా ఇద్దరు భక్తులు కుప్పకూలిపోయారు. రెస్క్యూ బృందాలు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆలయ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. గాయపడిన వారికి వెంటనే ప్రాథమిక చికిత్స అందించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశించా. ఆసుపత్రిని కూడా సందర్శిస్తాను" అని పేర్కొన్నారు.

కాగా, 12వ శతాబ్దపు పుణ్యక్షేత్రం దగ్గర నుండి శ్రీ గుండిచా ఆలయం వైపు వెళ్లే రహదారిపై వేలాది మంది జగన్నాథుడు, అతని తోబుట్టువుల రథాలను తాళ్లతో లాగారు. శుక్రవారం రథయాత్ర ఉత్సవం ప్రధాన భాగం ప్రారంభమైంది. ఒడిశా గవర్నర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, పలువురు ప్రముఖులు జగన్నాథుడు, దేవి సుభద్ర, బలభద్ర స్వామి రథాన్ని లాగిన వారిలో ఉన్నారు.

## ఆర్ఎస్ఎస్ దండుపాళ్యం రాజ్యాంగ హరణం

- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశంలో మళ్లీ సంఘ్ పరివార్ దండు బలంగా దిగిపోయిందని, ఇప్పుడు వారి అసలు ముఖం బయటపడిందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శించారు. రాజ్యాంగంలోని సామ్యవాదం, లౌకికత అనే పదాలను తొలిగించాలని ఆర్ఎస్ఎస్ సంచాలకుడు దత్తాత్రేయ హెుసబలే చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ, "ఇది ఆర్ఎస్ఎస్ అసలైన మానసికతకు నిదర్శనం" అని తీవ్రంగా మండిపడ్డారు.

రాహుల్ మాట్లాడుతూ "ఇప్పటివరకు ముసుగులు వేసుకుని వచ్చిన వారు ఇప్పుడు తమ అసలు రంగును చూపిస్తున్నారు. రాజ్యాంగం అంటే వీరికి అసహ్యం. ఎందుకంటే ఆ పీఠికలో సమానత్వం, లౌకికత, న్యాయం లాంటి విలువలు ప్రతిబింబిస్తాయి. వీరికి ఇవేవీ నచ్చవు. అందుకే రాజ్యాంగ పదాలను తొలగించాలన్న డిమాండ్ బలోపేతమవుతోంది" అని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం బడుగు, అణగారిన వర్గాల హక్కుల హరణకు దోహదపడేలా ఉందని, ఇది నిజంగా దండుపాళ్యం ఆలోచనావిధానంగా అభివర్ణించారు. "వీరికి మనుస్మృతి కావాలి. మనువాద శక్తుల స్వప్నమే ఇది. రాజ్యాంగం నుంచి శక్తివంతమైన పదాలను తొలగించాలన్న వారి ప్రయత్నం భారత ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఆర్ఎస్ఎస్‌కు తాము ఊహించే పగటికలలు నిజమవు. దేశం దీనికి అంగీకరించదు. ప్రతి దేశభక్తుడు తన తుదిశ్వాసవరకూ రాజ్యాంగ పీఠికను కాపాడుతాడు" అని స్పష్టం చేశారు. "రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలన్న మను జెండా ఎప్పటిలాగే తిరస్కారానికే గురవుతుంది" అని అభిప్రాయపడ్డారు.

## 30 నుంచి జూనియర్ డాక్టర్‌ల ధర్నా..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించకపోవడంతో ఈ నెల 30 నుంచి ధర్నా చేపట్టనున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (టీ–జూడాలు) వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం టీ జూడాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇసాక్ న్యూటన్ ఓ ప్రకటన విడుదల చేశారు. స్టైఫండ్ చెల్లింపులో జాప్యం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, బోధనా సిబ్బంది కొరత, స్కాలర్‌షిప్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఫీజు రీయింబర్స్‌మెంట్? చెల్లింపులో ఆలస్యంపై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రం అందజేసిన ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 30 నుంచి చేపట్టిన ధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా జూడాలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో జగన్నాథుని రథయాత్ర



- కన్నుల పండుగలా సాగిన యాత్ర

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని జగన్నాథ ఆలయంలో రథయాత్ర శనివారం కన్నుల పండుగలా కొనసాగింది. పూరీలో జగన్నాథ రథోత్సవం ప్రారంభమైన సమయానికే, ఈ ఆలయంలోనూ భక్తుల నడుమ ఉత్సాహభరిత వాతావరణంలో రథయాత్ర ప్రారంభమైంది. వేద మంత్రోచ్చారణల మధ్య బలరాముడు, సుభద్ర, జగన్నాథుని విగ్రహాలను మేళతాళాలతో రథాలపై ప్రతిష్ఠించారు. ఆపై భక్తుల దర్శనార్థం ఉంచిన అనంతరం రథాలు కనకదుర్గమ్మ ఆలయం దిశగా కదిలాయి. ముందుగా బలరాముని రథం, ఆ తరువాత సుభద్ర రథం, చివరగా జగన్నాథుని రథం నడిచింది. ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు హాజరయ్యారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగన్నాథస్వామి రథాన్ని 'నందిఘోష' అంటారు. ఇది పదహారు చక్రాలతో 41 అడుగుల ఎత్తు కలిగి ఉంటుంది. బలరాముడి రథం 'తాళధ్వజం', ఇది 14 చక్రాలతో 43 అడుగుల ఎత్తులో ఉంటుంది. సుభద్ర రథాన్ని 'దర్పదళన్'గా పిలుస్తారు. ఇది 12 చక్రాలతో 42 అడుగుల ఎత్తులో ఉంటుంది. ప్రతి రథానికి మిగితా 2వ పేజీలో

## ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల

- నేటి నుంచి జులై 7 వరకు స్లాట్ బుకింగ్
- జులై 6 నుంచి జూలై 10 వరకు వెబ్ ఆప్షన్లు
- జులై 14, 15 తేదీల్లో తొలి విడత మాక్ సీట్ల కేటాయింపు ప్రక్రియ
- మొదటి విడత సీట్లు కేటాయింపు జులై 18లోపు పూర్తి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఈఏపీసెట్ (ఇంజినీరింగ్) కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదలైంది. మొత్తం మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించడానికి ప్లాన్ చేశారు. ఫస్ట్ ఫేజ్ కౌన్సిలింగ్ లో భాగంగా శనివారం (జూన్ 28) నుంచి జులై 7 వరకు స్లాట్ బుకింగ్‌కు విద్యార్థులకు అవకాశం కల్పించారు. జులై 6 నుంచి జులై 10 వరకు వెబ్ ఆప్షన్ల ఇచ్చేందుకు షెడ్యూల్ చేశారు. అనంతరం జులై 14, 15 తేదీల్లో తొలి విడత మాక్ సీట్ల కేటాయింపు ప్రక్రియ మొదలవుతుంది. మొదటి విడత సీట్లు కేటాయింపు జులై 18లోపు పూర్తి చేస్తారు.

తొలి విడత కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు అనంతరం సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడతారు. జులై 25 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ మొదలవుతుంది. జులై 26 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొదలవుతుంది. అదే సమయంలోనే జులై 26, 27 తేదీల్లో సెకండ్ ఫేజ్‌లో సీట్ల కేటాయింపులకుగానూ వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. జులై 30లోపు రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తవుతుంది. ఆగస్టు 2వ తేదీలోగా సీట్లు వచ్చిన విద్యార్థులు కాలేజీలలో రిపోర్టింగ్ చేయాలని కన్వీనర్ సూచించారు. చివరి ఫేజ్ కౌన్సెలింగ్ అయిన థర్డ్ ఫేజ్ ఆగస్టు 5 న ప్రారంభం కానుంది. అదేరోజు విద్యార్థులకు స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. ఆగస్టు 6న సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయనున్నారు. ఆగస్టు 6, 7 తేదీల్లో ఫైనల్ గా విద్యార్థులకు వెబ్ ఆప్షన్లకు ఛాన్స్ ఇచ్చారు. ఆగస్టు 10వ తేదీలోపు సీట్లు కేటాయిస్తామని టీజీఈఏపీసెట్ కు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ లో పేర్కొన్నారు.

### విద్యా ప్రమాణాలు..

## మెరుగైన వసతులే ప్రామాణికం

- ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల నిర్ణయంపై ప్రభుత్వం యోచన
- గత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక పరిశీలన
- పరిగణనలోకి సుప్రీంకోర్టు తీర్పులు
- ఆయా అంశాల అధ్యయనానికి కమిటీ నియామకం....
- నిర్దేశిత సమయంలోనే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయంపై హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్‌లు, భవనాలు.. ఇతర వసతులు... ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలనే భావనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కృత్రిమ మేధ (ఏఐ) వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీ పడేలా ఉండాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్లు కళాశాలలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ప్రణాళికబద్ధంగా ముందుకువెళ్లేలా వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు.. ఏఐసీటీఈ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని ఆశిస్తున్నారు. ఫీజుల నిర్ణయానికి వీటినే ప్రాతిపదిక తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఫీజుల నిర్ణయానికి సంబంధించి ఇస్లామిక్ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ వర్సెస్ కర్ణాటక, పీఏ ఇనాందార్ అండ్ అదర్స్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో... ఆయా కళాశాలల్లోని వసతులు, ల్యాబ్‌లు, లెక్చరర్లకు ఆ సంస్థ ఇచ్చే వేతనాలు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల భవిష్యత్ ప్రణాళికలు, కళాశాల ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపాదిక చేసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫీజుల నిర్ణయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులు, బోధన సిబ్బంది.. ఇతర వ్యవహారాలపై గత ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో తనిఖీలు చేయించింది. ఆ శాఖ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నివేదిక రూపొందించింది. కానీ గత ప్రభుత్వం ఆ నివేదికపై ఎటువంటి చర్య తీసుకోలేదు. కానీ తమకు నచ్చిన కళాశాలలకు ఫీజులు పెంచుకునే అవకాశాన్ని కల్పించి.. మరికొన్ని కళాశాలలకు మాత్రం పక్షపాత వైఖరితో మొండి చేయి చూపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ నివేదిక పరిశీలనతో పాటు ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలను మదింపు చేసి ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు ఒక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



## జీవో నం 49తో ఎవరి భూములను తీసుకోవడం లేదు

- నా ఫోన్ కూడా ట్యాప్ అయ్యింది
- మంత్రి జూపల్లి కృష్ణారావు

బలగం టీవీ, ఆదిలాబాద్

జీవో నం 49తో ఎవరి భూములను వెనక్కి తీసుకోవడం లేదని ఆదిలాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఉట్నూర్ లోని పీఎంఆర్సీలో జీవో నం 49పై ఆదివాసీలతో ఆదిలాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జీవో నం 49పై ఇంకా గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయవద్దని ఇప్పటికే అధికారాలను ఆదేశించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఆదివాసీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదివాసీలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత అటవీ శాఖ మంత్రి గారితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అటవీ, పర్యావరణ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందని... రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న విస్తృత అధికారాలను ఉపయోగించి ఆదివాసులకు మేలు చేసేలా సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందేలా చూడాల్సిన భాద్యత రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉందన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి, జిల్లాల ఇన్‌చార్జి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ట్యాపింగ్‌లతో ప్రజల స్వేచ్ఛకు ముప్పు తెచ్చిందని విమర్శించారు. "ఇలాంటి తలతిక్క పనులు చేస్తున్నారని ప్రజలు గ్రహించి, ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారు. అందుకే కేసీఆర్ పాలన కుప్పకూలిపోయింది" అని మండిపడ్డారు. కాళేశ్వరం సహా అనేక కీలక అంశాల్లో కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని మిగితా 2వ పేజీలో

# దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పీవీ

**మాజీ ప్రధానిని స్మరించుకున్న సీఎం రేవంత్ రెడ్డి**

బలగం టీవీ, హైదరాబాద్

మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారతరత్న పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం లోనూ, అన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పి.వి.నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి కొనియాడారు. పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయని అన్నారు. విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలు ప్రవేశ పెట్టారని, నవోదయ విద్యాలయాలు పీవీ హయాంలోనే ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సర్వేల్ రెసిడెన్షియల్ స్కూల్ నెలకొల్పి గురుకుల విద్యకు తొలి అడుగులు వేశారని తెలిపారు. పీవీ స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్టు సీఎం తెలియజేశారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రతి నియోజక వర్గంలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం సంకల్పించిందని గుర్తుచేశారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోండి

**● మాజీ మంత్రి హరీశ్ రావు**

బలగం టీవీ, హైదరాబాద్

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. నగరంలో జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాల పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు. మేడ్చల్ జిల్లా దుండిగల్ పరిధిలో జరిగిన హృదయవిదారకమైన రోడ్డు ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. అభం శుభం తెలియని ఐదేళ్ల బాలుడు టిప్పర్ చక్రాల కింద దుర్మరణం పాలు కావడం దారుణమని పేర్కొన్నారు. బాబును కోల్పోయి తీవ్ర విచారంలో ఉన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారికి కలిగిన నష్టం తీర్చలేనిదని తెలిపారు. ఇటీవల జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలు తీవ్ర భయాందోళనలను కలిగిస్తున్నాయని చెప్పారు. కళ్ల ముందే అయిన వారిని కోల్పోయిన కుటుంబ సభ్యులు, భరించలేని మానసిక వేదనకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. బాధ్యత గల ప్రభుత్వం దీనిపై వెంటనే దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. భారీ వాహనాలను పరిమిత సమయంలోనే నగరంలోకి అనుమతించాలన్న నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా పాఠశాల వేళల్లో భారీ వాహనాలు రోడ్లపై ప్రయాణించకుండా చూడాలని, స్కూల్ జోన్ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ఒక అమాయక ప్రాణం దానికి ఖరీదు చెల్లించవలసి వస్తున్నదని పేర్కొన్నారు. వ్యవస్థాగత వైఫల్యాల వల్లనే, నిబంధనల అమలులో ఉన్న లోపాల వల్లనే రోడ్డు ప్రమాదాల్లో జనం ప్రాణాలు కోల్పోతున్నారని,. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువగా బలవుతున్నారని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనల అమలు, డ్రైవర్లకు తగిన శిక్షణ, మద్యం మత్తులో వాహనాలు నడపకుండా కట్టుదిట్టమైన చర్యలు, ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల పౌరులు కూడా అంతే బాధ్యతతో నడుచుకోవాలని కోరారు.

# హుస్నాబాద్ అభివృద్ధే లక్ష్యం

**● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

బలగం టీవీ, హైదరాబాద్



రాష్ట్ర ప్రజల సర్వతోముఖ అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే మార్గదిశగా నిలుస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా రూ.82 కోట్ల వ్యయంతో 250 పడకల ఆసుపత్రికి, రూ.11.5 కోట్లతో మాత-శిశు ఆరోగ్య కేంద్రానికి, కొత్తపల్లి నుండి హుస్నాబాద్ వరకు రూ.77 కోట్లతో నిర్మించనున్న నాలుగు వరుసల రహదారి (ప్యాకేజీ-2), సుందరగిరి నుండి కొత్తపల్లి వరకు రూ.80 కోట్ల రహదారికి శంకుస్థాపన చేశారు. అదనంగా మహిళా సంఘాల కోసం రూ.71.30 కోట్ల విలువైన చెక్కులను మంత్రుల బృందం పంపిణీ చేసింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'రైతులకు తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు పంట పెట్టుబడి మద్దతుగా ఇచ్చాం. రూ.21 వేల కోట్ల రుణమాఫీ పూర్తయ్యింది" అని వివరించారు. గత పాలకులు హుస్నాబాద్ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని, గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను పూర్తిచేయలేకపోయారని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వం కాలువల పనులను వేగవంతంగా కొనసాగిస్తోందన్నారు. పొన్నం ప్రభాకర్ ప్రజల్లోంచే వచ్చిన నేతగా అభివృద్ధి పథాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి కొనియాడారు. "ఎన్ఎస్‌యూఐ నుంచే ప్రజా జీవితంలోకి వచ్చి గల్లీగల్లీ తిరుగుతూ ప్రజల మద్దతు పొందుతున్న నేత" అని ప్రశంసించారు. ప్రాంతాలకు అతీతంగా మంచికి మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే తమ లక్ష్యమని.. అందరం కలిసి పనిచేస్తామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ సంకల్పమని తెలిపారు.

# కొత్తగా 3 ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలు

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా మూడు ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలను సర్కారు మంజూరు చేసింది. 2025-26 విద్యాసంవత్సరంలోనే ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హుస్నాబాద్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కాలేజీ మంజూరైందని తెలిపారు. అందులో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో 60 సీట్లు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) (సీఎస్ఏ)లో 60 సీట్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఎన్ఎఫ్)లో 60 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ)లో 60 సీట్ల చొప్పున మొత్తం 240 సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్‌లోని పాలమూరు విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కాలేజీ మంజూరైందని వివరించారు. అందులో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో 60 సీట్లు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) (సీఎస్ఏ)లో 60 సీట్లు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (డేటాసైన్స్) (సీఎస్‌డీ)లో 60 సీట్లు కలిపి మొత్తం 180 సీట్లకు అనుమతి వచ్చిందని తెలిపారు. కొత్తగూడెంలోని ఎర్త్‌సైన్సెస్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో 60 సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ)లో 60 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ)లో 60 సీట్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఎన్ఎఫ్)లో 60 సీట్లు, మైనింగ్ ఇంజినీరింగ్ (ఎంఐఎన్)లో 60 సీట్లు కలిపి మొత్తం 300 సీట్ల భర్తీకి అనుమతి వచ్చిందని పేర్కొన్నారు. మూడు వర్సిటీల్లోని మూడు కాలేజీల్లో 720 సీట్ల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వివరించారు.

# జీవో నం 49తో ఎవరి భూములను తీసుకోవడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. "ఫోన్ ట్యాపింగ్‌లు, ప్రజలపై నిఘాలు పెట్టడం ఎటువంటి ఆదర్శ పాలనకు నిదర్శనమో?" అని ప్రశ్నించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ పార్టీనే అధిక స్థానాలు సాధిస్తుందన్న విశ్వాసం తనకు ఉందని మంత్రి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పాలన ద్వారా మార్పులు తీసుకొస్తామని, నాయకుల మధ్య విభేదాలను తొలగించి కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామన్నారు. "బీజేపీకి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శించే నైతిక హక్కే లేదు" అని సూటిగా ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ పాత్ర లేదని, అప్పట్లో మానవీయ కోణంలో సోనియా గాంధీనే ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. "మొత్తం బీజేపీ పాలనలో తెలంగాణకు ఏ ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వలేదు. బీహార్, యూపీలకు భారీ నిధులు ఇస్తూ.. తెలంగాణను దుర్లక్ష్యం చేశారు" అని ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అపరిశుభ్రతపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, ఐసీయూ, బ్లడ్ బ్యాంక్, అవుట్ పేషంట్స్ విభాగాలను పరిశీలించారు. "ప్రతి అడుగులోనూ అపరిశుభ్రత కనిపిస్తోంది. ఇది తగదు" అంటూ అధికారులను హెచ్చరించారు. పారిశుద్ధ్య కాంట్రాక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీన్‌ను ఆదేశించారు.

# హైదరాబాద్‌లో జగన్నాథుని రథయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా తాడులు శంఖచూడ నాగ, వాసుకీ నాగ, స్వర్ణచూడ నాగలు ఉపయోగించారు. ఆషాఢ శుద్ధ విదియ నాడు ప్రారంభమయ్యే ఈ ఉత్సవం తొమ్మిది రోజుల పాటు కొనసాగుతుంది. ఈ కాలంలో దేవతా మూర్తులు కనకదుర్గమ్మ ఆలయంలో నిలిపి ఉంచుతారు. అనంతరం రెండురోజులు దర్శనార్థంగా బయట ఉంచి, 11వ రోజున మళ్లీ గర్భగుడిలోకి తీసుకెళ్తారు.

జగన్నాథుడు, బలరాముడు, సుభద్ర ఒకే కుటుంబానికి చెందినవారు కావడం వల్ల వీరిని వేర్వేరు రథాలలో ఊరేగించడం ప్రత్యేకతగా నిలుస్తుంది. ముందు అన్నగారి రథం, తర్వాత చెల్లెలి రథం, ఆ తర్వాత జగన్నాథుని రథం సాగుతుంది. ఇది వారి మధ్య ఉన్న అనురాగాన్ని చాటిచెబుతోంది. ఈ రథోత్సవాన్ని చూసేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు రథాలను లాగేందుకు పోటీపడ్డారు. జగన్నాథుని దర్శనం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని పలువురు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# న్యాయ విద్యార్థినిపై సామూహిక లైంగికదాడి



బలగం టీవీ, కోల్‌కతా

ఆర్జీకర్ వైద్య కళాశాలలో వైద్యురాలిపై హత్యాచార ఘటన మరవకముందే, కోల్‌కతాలో మరో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. సౌత్ కోల్‌కతాలోని లా కళాశాల విద్యార్థినిపై ముగ్గురు యువకులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను గురువారం రాత్రి అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ముగ్గురు నిందితులను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించారు.

నిందితుల్లో ఇద్దరు కళాశాలలో విద్యార్థినికి సీనియర్లుగా ఉండగా, మూడో నిందితుడు అదే కళాశాల పూర్వ విద్యార్థి అని పోలీసులు తెలిపారు. బాధితురాలు జూన్ 25న సాయంత్రం కాలేజ్ ప్రాంగణంలోనే ఈ లైంగికదాడికి గురైనట్టు తెలుస్తోంది. విచారణ ప్రారంభ దశలోనే ఉందని పోలీసులు వెల్లడించారు. నిందితుల్లో ఒకడైన మనోజిత్ మిశ్రా తృణమూల్ కాంగ్రెస్‌కి చెందిన సభ్యుడిగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతను ప్రస్తుతం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాడని జాతీయ మీడియా పేర్కొంది.

ఈ ఘటనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. "బంగాల్‌లోని విద్యాసంస్థలు విద్యార్థినులకు సురక్షితం కావు" అని కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా హోంశాఖను పర్యవేక్షిస్తున్నా రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో లేవని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష నేత సువేందు అధికారి మమత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.


కోల్‌కతా ఘటనను జాతీయ మహిళా కమిషన్ స్వయంగా సుమోటోగా స్వీకరించింది. కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్, కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మకు లేఖ రాస్తూ, మూడురోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. బాధితురాలికి వైద్య, న్యాయ సహాయం కల్పించి, భారత న్యాయ సంహిత సెక్షన్ 396 ప్రకారం పరిహారం అందించేలా చూడాలని సూచించారు.

# ఎమ్మెల్సీ కవిత ఇంటికి కేంద్ర మంత్రి..!

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించేలా చొరవ చూపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలేను కోరారు. శుక్రవారం హైదరాబాద్ పర్యటనకు వచ్చిన అథవాలే, కవిత ఆహ్వానం మేరకు ఆమె నివాసానికి వెళ్లారు. కవిత నివాసంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాష్ట్ర శాసనసభ ఆమోదించి పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లు చాలాకాలంగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని ఆమె కేంద్ర సహాయ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక సంస్థల్లో బీసీలకు వారి జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరమని ఆమె అన్నారు. తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే న్యాయమైన డిమాండ్ అని, దీనికి తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. సమాజ నిర్మాణంలో బహుజనుల పాత్ర కీలకమైనప్పటికీ, స్థానిక సంస్థల్లో వారికి సరైన ప్రాతినిధ్యం లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొన్నారు.

## జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ



- ఎస్పీ ఉత్తర్వులు జారీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతిభద్రతల పర్యవేక్షణ, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా పలువురు సబ్–ఇన్‌స్పెక్టర్ (ఎస్.ఐ.ల)ను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా ఎస్సైలు నూతన స్థానాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.



## ప్రభుత్వ విప్ చెక్కుల పంపిణీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో వేములవాడ అర్బన్, పట్టణ పరిధిలో అర్హులైన 76 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి అండ్ షాది ముబారాక్, 18 లక్షల 80 వేల విలువ గల 54 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## తంగళ్ళపల్లికి నూతన ఎస్సైగా ఉపేందర్ చారి..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా ఉపేందర్ చారి నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు తంగళ్ళపల్లి ఎస్సైగా విధులు నిర్వర్తించిన రామ్మోహన్ వేములవాడ టౌన్‌కు బదిలీ అయ్యారు. రామ్మోహన్ బదిలీ అనంతరం ఉపేందర్ చారి తంగళ్ళపల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించనున్నారు.



## బీజేపీ పట్టణశాఖ పాలకవర్గం నియామాకం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భారతీయ జనతా పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ కార్యవర్గాన్ని, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆదేశానుసారం కార్యవర్గ నియామకం ఏర్పాటు చేయనైనది. బీజేపీ పట్టణశాఖ పాలకవర్గం నియామాకంలో ఉపాధ్యక్షులు మోర శ్రీహరి, అంకారపు రాజు, కాంబోజ శ్రీధర్, పల్లికొండ నర్సయ్య, ప్రధాన కార్యదర్శులు కొండ నరేష్, మేర్గు శ్రీనివాస్, కార్యదర్శులు కోడం రవి, సూరం వినయ్, పంపరి అర్జున్, కోడం శ్రీనివాస్, కోశాధికారి ఇంజపూరి మురళి మరియు 33 మంది కార్యవర్గ సభ్యులను నియమించడం జరిగింది. ఇట్టి నియామకం తక్షణమే అమలులో వస్తుందని దుమాల శ్రీకాంత్ బి.జె.పి పట్టణ అధ్యక్షులు అన్నారు.



## డ్రోన్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

**బలగం టీవీ, బోయినపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో బుధవారం రోజున కరీంనగర్ ఉమ్మడి జిల్లా డ్రోన్ యూనియన్ సమావేశం ఏర్పాటు చేసుకొని, కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులు విక్రుతి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు దాన వేణు, ప్రధాన కార్యదర్శి చిందం శశి, క్యాషియర్ భూపేందర్ రెడ్డి, కార్యదర్శి ఎర్రం రామిరెడ్డి, ఉపాధ్యక్షులు రాసూరి అశోక్, ఎం నవీన్ ,మహేష్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, డైరెక్టర్స్ శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, అజయ్, మోహన్ ,బండి నరేష్, భీమ నరేష్ ,మహేందర్, చిగుళ్ల శ్రీనివాస్, గంట శ్రీనివాస్, మహేందర్ లను ఎన్నుకున్నారు.

# ఆపరేషన్ ముస్కాన్- XI ను విజయవంతం చేయాలి..

- ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీపీ చారు సిన్హా

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జూలై 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్ - XIను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డిజిపి చారు సిన్హా ఐపిఎస్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఉమెన్ సేఫ్టీ వింగ్ కార్యాలయం నుండి వివిధ జిల్లాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ చంద్రయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డిజిపి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆపరేషన్ ముస్కాన్‌ను పక్కా ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో పాల్గొంటున్న ప్రతి అధికారి సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. బాలకార్మికులు కనిపించినట్లయితే



వెంటనే పోలీసులకు లేదా 1098 నంబర్‌కు సమాచారం అందించేలా ప్రజలలో అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. అంతేకాకుండా, బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారికి చట్ట ప్రకారం శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన అదనపు ఎస్పీ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల, వేములవాడ డివిజన్ల స్థాయిలో ఎస్.ఐ. స్థాయి అధికారి, ఒక మహిళా పోలీసు అధికారి, నలుగురు సిబ్బంది, వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ బృందాలు జిల్లాలోని ఇటుక బట్టీలు, వివిధ రకాల పరిశ్రమలు, బస్ స్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసి, కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీడబ్ల్యూసీ చైర్మన్ అంజయ్య, ఇన్‌స్పెక్టర్లు నటేష్, నాగేశ్వ రరావు, జిల్లా షీ టీమ్ అధికారులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హోం గార్డ్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పని చేస్తున్న హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని డిజిపి కార్యాలయం నుండి వచ్చిన ఉలెన్ జాకెట్స్ అండ్ రెయిన్ కోట్స్‌ను వారికి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోమ్ గార్డ్స్ పోలీసు శాఖలో అంతర్గత భాగమని,పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారని, ప్రతి పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందితో బాటు విధులు నిర్వహిస్తున్నారని, క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోమ్ గార్డ్స్ అధికారులు, సిబ్బంది ఎవరికైన సమస్యలు ఉంటే నేరుగా తనని సంప్రదించవచ్చని, రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

నిరంతరం ఎండనకా, వాననకా రాత్రింబవళ్ళు కష్టపడి పని చేసే



సిబ్బందికి అత్యవసర సమయాలలో ఉలెన్ జాకెట్స్ అండ్ రెయిన్ కోట్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పనిచేస్తూ నిబంధనలు ఉల్లంగిస్తే భవిష్యత్తులో శాఖ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు యాదగిరి, మధుకర్, హోమ్ గార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక వారానికి రెండు సార్లు అనుమతివ్వాలి..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల లో మానేరు వాగు నుండి ఇసుక రవాణాను బ్లాక్ చేయడంతో, స్థానిక ట్రాక్టర్ యజమానులు ఇష్టానుసారంగా ఒక ట్రాక్టర్

**- మానేరు వాగు నుండి ఇసుక స్థానిక అవసరాలకు వారానికి రెండు సార్లు ఇప్పించుట గురించి జిల్లా కలెక్టర్? కు వినతి..**

**బీజేపీ పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్**

ట్రిప్పుకు రూ. 4000/– నుండి 5000/– వరకు అక్రమ ఇసుక రవాణా చేస్తూ ఇంటి నిర్మాణదారుల నుండి వసూలు చేస్తున్నారు. ఈ విధంగా ఇలాగే కొనసాగితే బ్లాక్ లో ఇసుక ట్రిప్పు రేటు ఇంకా పెరిగే అవకాశం కలదు అని అన్నారు. కావున తమరు ఇట్టి విషయంలో చొరవ తీసుకుని స్థానిక అవసరాలకు గాను మానేరు వాగు నుండి ఇసుక రవాణాను వారానికి రెండు సార్లు బిల్లులు ఇప్పించవలసినదిగా సిరిసిల్ల పట్టణ ప్రజల పక్షాన తమరిని అభ్యర్థించుచున్నామని అన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులు, పుస్తకాల విక్రయాలపై డీఈఓకు వినతి

**కంచర్ల రవి గౌడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, జిల్లా విద్యాధికారి (డీఈఓ) దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల్లోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తూ, ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా అమ్ముతున్నారని, ఇది మధ్యతరగతి కుటుంబాలకు తీవ్ర భారంగా మారిందని అన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ పక్షాన డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, పాఠశాల ఆవరణలో పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమ విజ్ఞప్తిని పట్టించుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్, వడ్లూరి సాయి కిరణ్, షేక్



అప్రోచ్, కోడం వెంకటేష్, ఎండి అజ్జు, తిరుమలే రాకేష్, మొగిలి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఈసారి చదరంగం కాదు రణరంగమే




- బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9పై అధికారిక ప్రకటన
- హెూస్ట్‌గా మరోసారి అక్కినేని నాగార్జున

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు టెలివిజన్ ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న రియాలిటీ షో 'బిగ్‌బాస్' కొత్త సీజన్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. బిగ్‌బాస్ తెలుగు సీజన్ 9 త్వరలో ప్రారంభం కానుందని నిర్వాహకులు తాజాగా ప్రకటించారు. ఈ షోకు హెూస్ట్‌గా కింగ్ అక్కినేని నాగార్జున వ్యవహరించనుండగా, "ఈ సారి చదరంగం కాదు.. రణరంగమే" అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో సరికొత్త ప్రోమోను విడుదల చేశారు. ఈ ప్రోమోలో వ్యాఖ్యాత నాగార్జున కనిపించారు. గత సీజన్ల మాదిరిగా కాకుండా ఈసారి పోటీ మరింత తీవ్రంగా ఉండనుందని "చదరంగం కాదు.. రణరంగమే" అనే ట్యాగ్‌లైన్ స్పష్టం చేస్తోంది. వ్యూహాలు, ఎత్తుగడలతో సాగే ఆటలా కాకుండా, నిజమైన పోరాట క్షేత్రాన్ని తలపించేలా ఈ సీజన్ ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు.

హెూస్ట్‌గా నాగార్జున కొనసాగడం ఈ షోకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. తనదైన శైలిలో కంటెస్టెంట్లతో వ్యవహరిస్తూ, వీకెండ్ ఎపిసోడ్లను రక్తి కట్టించడంలో ఆయన విజయం సాధించారు. ప్రస్తుతం ఈ ప్రోమో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. బిగ్‌బాస్ సీజన్ 9 ప్రారంభ తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, ప్రోమో విడుదలతో షో సందడి మొదలైంది.



# విజయం దిశగా శ్రీలంక

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ తొలి సిరీస్‌లో శ్రీలంక విజయదిశగా దూసుకుపోతోంది. గాలే టెస్టు డ్రాగా ముగియడంతో కొంత వెనుకబడ్డ లంక, కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో పూర్తిగా ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 115 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిపోయింది. శ్రీలంక స్పిన్నర్లు ధనంజయ డిసిల్వా (2/13), ప్రభాత్ జయసూర్య (2/47) తమ అద్భుత బౌలింగ్‌తో బంగ్లా బ్యాటర్లను ఒక్కొక్కరిని పెవిలియన్ బాట పట్టించారు. మొదటి ఇన్నింగ్స్‌లో నిరాశపరిచిన బంగ్లా ఆటగాళ్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే పునరావృతం చేశారు. వంద పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన పర్యాటక జట్టు, చివరికి 115 వద్ద ఆరవ వికెట్‌ను కూడా కోల్పోయింది.

మూడో రోజు ఆఖరి సెషన్ చివరి బంతికి రత్నాయకే, మెహిదీ హసన్ మిరాజ్‌ను ఎల్బీగా ఔట్ చేయడంతో బంగ్లాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. లిటన్ దాస్ (13 నాటౌట్) క్రీజులో ఉన్నప్పటికీ, మరోసారి జట్టు తలదించుకునే పరిస్థితిలో పడింది. ప్రస్తుతం బంగ్లాదేశ్ శ్రీలంక తొలి ఇన్నింగ్స్ స్కోర్ కంటే ఇంకా 96 పరుగులు వెనుకబడి ఉంది. టెయిలెండర్ల మద్దతుతో లిటన్ దాస్ ఎంతవరకు పోరాడగలడో చూడాలి. మరోవైపు, శ్రీలంక బౌలర్లు బంగ్లాను త్వరగా ఆలౌట్ చేస్తే... ఈ టెస్టుతో పాటు సిరీస్‌ను కూడా సొంతం చేసుకునే అవకాశముంది.

## మంచు విష్ణు భావోద్వేగ ట్వీట్

**బలగం టీవీ, హైదరాబాద్**



నటుడు మంచు విష్ణు 'కన్నప్ప' చిత్రం విడుదల సందర్భంగా భావోద్వేగానికి లోనయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ క్షణం రానే వచ్చిందంటూ, శుక్రవారం సోషల్ మీడియా వేదికగా మాట్లాడారు. ఈ సినిమాపై వస్తున్న స్పందన పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "ఈ క్షణం... నా జీవితాంతం దీని కోసమే ఎదురుచూశాను" అంటూ తన ట్వీట్‌ను ఎంతో ఉద్వేగభరితంగా ప్రారంభించారు. భారత్‌లో ఉదయం ఆటలతో పాటు, విదేశాల్లోని ప్రీమియర్ షోల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన, ప్రేమ తన హృదయాన్ని కృతజ్ఞతతో నింపేసిందని ఆయన పేర్కొన్నారు. ""కన్నప్ప' ఇకపై కేవలం నా సినిమా మాత్రమే కాదు. ఇది ఇప్పుడు మీ అందరిది" అని విష్ణు తన పోస్టులో పేర్కొన్నారు. అభిమానులు చూపిస్తున్న ఆదరణకు ప్రతిగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చివరగా "హర్‌హర్‌మహాదేవ్" అనే హ్యాష్‌ట్యాగ్‌తో తన పోస్టును ముగించారు.




## ఆస్కార్ అకాడమీలో కమల్‌కు చోటు

**బలగం టీవీ, హైదరాబాద్**

కమల్ హాసన్‌తో పాటు బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా అరుదైన గౌరవం అందుకున్నారు. అంతర్జాతీయంగా భారతీయ సినిమా ప్రతిష్టను పెంచుతూ ప్రముఖ నటులు కమల్ హాసన్, అయుష్మాన్ ఖురానా ఆస్కార్ అకాడమీ సభ్యులుగా ఎంపికయ్యారు. 'ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' తాజాగా విడుదల చేసిన 2025 సభ్యత్వ జాబితాలో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇకపై ఆస్కార్ అవార్డుల తుది నామినేషన్ల ఎంపికలో వీరు ఓటింగ్ హక్కుతో భాగస్వాములవుతారు. ఈ ఏడాది సభ్యత్వానికి ఎంపికైన వారిలో కమల్, అయుష్మాన్‌తో పాటు ప్రముఖ దర్శకురాలు పాయల్ కపాడియా, ఫ్యాషన్ డిజైనర్ మాక్సిమా బసు కూడా ఉన్నారు. మొత్తం 534 మందికి సభ్యత్వ ఆహ్వానం అందగా, అందులో 19 విభాగాలకు చెందిన నిపుణులకు చోటు దక్కింది. కొత్తగా ఆహ్వానం పొందిన వారిలో 41 శాతం మహిళలు ఉన్నారు. వచ్చే సంవత్సరం మార్చి 15న ఆస్కార్ అవార్డు వేడుక జరగనుండగా, జనవరి 12 నుండి 16 మధ్య నామినేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు. వాటి పరిశీలన అనంతరం తుది నామినేషన్‌ల జాబితాను జనవరి 22న ప్రకటించనున్నారు. అయితే కమల్ హాసన్ వంటి లెజెండరీ నటుడితో పాటు యంగ్ హీరో ఆయుష్మాన్ ఖురానా ఆస్కార్ కుటుంబంలో చేరడం గర్వకారణం అని భారతీయులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## వెస్టిండీస్ క్రికెటర్‌పై లైంగికదాడి ఆరోపణలు

**బలగం టీవీ, హైదరాబాద్**



వెస్టిండీస్‌కు చెందిన ఓ క్రికెటర్‌పై లైంగిక దాడి ఆరోపణలు వచ్చాయి. ఓ యువతిని అతను లైంగికంగా వేధించినట్లు గయానాలో ఫిర్యాదు నమోదు అయ్యింది. అయితే ఆ క్రికెటర్‌పై మరో 11 మంది మహిళలు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. గయానా పోలీసులు దీనిపై దర్యాప్తు ప్రారంభించినట్లు స్థానిక మీడియా నివేదించింది. అయితే ఆ క్రికెటర్ పేరు ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించలేదు.

2023లో న్యూ ఆమ్‌స్టర్‌డామ్ ప్రాంతంలో జరిగిన లైంగిక దాడికి సంబంధించి ఓ 18 ఏళ్ల యువతి మొదటిసారిగా ఫిర్యాదు చేయగా, ఆ వెంటనే మరికొంత మంది మహిళలు కూడా ముందుకు వచ్చారు. మొత్తం 11 మంది మహిళలు అదే ఆటగాడిపై ఆరోపణలు చేశారని తెలుస్తోంది. బాధితులంతా తమ వద్ద ఉన్న టెక్స్ట్ మెసేజ్‌లు, వాయిస్ నోట్స్, స్క్రీన్‌షాట్స్‌ను పోలీసులకు సమర్పించినట్లు సమాచారం. కేసును చల్లార్చేందుకు ఆ క్రికెటర్ ప్రయత్నించాడని బాధిత యువతులు ఆరోపిస్తున్నారు.

ఇదిలా ఉండగా "మైదానంలో ఓ రాక్షసుడు తిరుగుతున్నాడు" అంటూ గయానా మీడియా తీవ్రంగా విమర్శించింది. సదరు ఆటగాడు గయానాకు చెందినవాడిగా స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ ఆరోపణలపై స్పందించిన వెస్టిండీస్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు కిషోర్ షా, "ఇప్పటి వరకు పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం మాకు రాలేదు. దీనిపై ప్రస్తుతం ఎలాంటి వ్యాఖ్యలు చేయలేం" అని మీడియాకు తెలిపారు. ప్రస్తుతం వెస్టిండీస్ జట్టు ఆస్ట్రేలియాలో టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న నేపథ్యంలో, ఆరోపణలలో ఉన్న ఆటగాడు జట్టులో ఉన్నాడనే చర్చ సాగుతోంది.



## సుప్రీంకు తిరుమల కల్తీ లడ్డూపై సిట్ నివేదిక

**బలగం టీవీ, హైదరాబాద్**

తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూకి ఉపయోగించే నెయ్యి కల్తీ వ్యవహారంపై సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక అందించింది. రెండు రోజుల క్రితం సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు ఈ నివేదికను సిట్ అధికారులు అందించినట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా కేసు దర్యాప్తు పురోగతి, ఇప్పటి వరకు దర్యాప్తులో తేలిన విషయాలతో నివేదిక అందించారని సమాచారం. అలాగే, ఈ కేసు దర్యాప్తు ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు బయటపడిన అంశాలు, స్థానిక కోర్టు నుండి హైకోర్టు వరకు కూడా నిందితులు దాఖలు చేసిన పిటిషన్లు, వాటిపైన జరుగుతున్న విచారణ, వాటి పురోగతి తదితర అంశాలను నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తిరుపతి ప్రసాదం లడ్డూలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఆరోపణలు సర్వత్రా చర్చకు, విమర్శలకు దారితీశాయి. దీంతో ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలోకి వెళ్లింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సిట్‌ను నియమించిన సంగతి తెలిసిందే. అసలు చాలా విషయాలను సుప్రీంకోర్టుకు ఇచ్చిన రిపోర్టులో వెల్లడించి ఉంటారని భావిస్తున్నారు. ఇటీవల తనకు ఓ పోలీసు అధికారి నోటీసులు జారీ చేశారని ఆయన సిట్‌లో భాగం కాదని వైసిపి రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి కోర్టు కెళ్లారు. దీంతో కోర్టు కూడా వైవి సుబ్బారెడ్డికి ఇచ్చిన నోటీసుల్ని రద్దు చేసింది. ఏది ఏమైనా సిట్ రిపోర్టులో ఏముందనేది సుప్రీం కోర్టు విచారణలో తేలనుంది.



## విడుదలకు సిద్ధంగా 'పరమ్ సుందరి'


**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్‌లో ఓ కొత్త జంటగా వెండితెరపై ఆకట్టుకోబోతున్నారు సిద్ధార్థ్ మల్హోత్రా – జాన్వీ కపూర్. ఈ జంట ప్రధాన పాత్రల్లో నటించిన 'పరమ్ సుందరి' అనే క్రాస్ కల్చర్ రొమాంటిక్ డ్రామా చిత్రాన్ని తుషార్ జలోటా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో నార్త్ కుర్రాడిగా సిద్దార్థ్, కేరళ అమ్మాయిగా జాన్వీ కపూర్ పాత్రధారులుగా కనిపించనున్నారు. ఇది నార్త్–సౌత్ సంస్కృతుల మేళవింపుతో కూడిన కథగా తెరకెక్కింది. ఇటీవల సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ లుక్ వైరల్‌గా మారింది. సంప్రదాయ కేరళ అమ్మాయిగా చీర, జాకెట్‌లో ముస్తాబై, తలలో మల్లెచెండులు, అందమైన నవ్వుతో మెరిసిపోతున్న ఫోటో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

## యోధురాలిగా రష్మిక

### 'మైసా' ప్రాజెక్ట్ అధికారిక ప్రకటన

**బలగం టీవీ, హైదరాబాద్**




నేషనల్ క్రష్‌గా పేరుగాంచిన రష్మిక మందన్న 'పుష్ప 2', 'ఛావా', 'సికందర్' వంటి చిత్రాలతో విజయాలు అందుకుంది. ఈ ముద్దుగుమ్మ తాజాగా 'కుబేరా' చిత్రంతో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఇప్పుడు మరో విభిన్నమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. రష్మిక తన కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'మైసా' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. దర్శకుడు రవీంద్ర పూలే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో విడుదల కానుంది. తాజాగా విడుదలైన టైటిల్ పోస్టర్‌లో రష్మిక పచ్చగా, బలంగా కనిపిస్తున్నారు. ముఖంపై రక్తపు మచ్చలు, ట్రెడిషనల్ శారీ, ఆవేశంతో నిండిన లుక్.. ఇవన్నీ కలగలిపి రష్మిక పాత్ర ఒక యోధురాలి రూపంలో ఉండబోతోందని సంకేతాలు ఇస్తున్నాయి. ఈ పాత్ర గురించి నిర్మాతలు "ధైర్యమే ఆమె బలం. సంకల్పంలో లేదు కనికరం. ఆమె గర్జన వినడానికి కాదు... భయపెట్టడానికి!" అంటూ ఇచ్చిన హింట్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది ఒక పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌పై రష్మిక మాట్లాడుతూ "నేను ఎప్పుడూ కొత్తదనం కోరుకుంటాను. అలాంటి కథలకే ప్రాధాన్యత ఇస్తాను. 'మైసా' అలాంటి చిత్రమే. ఇది నేను ఇప్పటి వరకు చేసిన పాత్రలకన్నా భిన్నమైనది. ఇది నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఇది ఆరంభం మాత్రమే" అని తెలిపారు.